




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| గురువారం 12 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 283 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|


## పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం... ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ భారీ వైమానిక దాడులు, 1700 మంది మృతి

### ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించాయి. అనేక మంది నగరాన్ని విడిచి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు వెల్లడి






సందేశం టైమ్స్, అంతర్జాతీయ డెస్క్, మార్చి 12 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయిల్ సంయుక్తంగా భారీ వైమానిక దాడులు కొనసాగించడంతో పరిస్థితి యుద్ధ స్థాయికి చేరుకుంది. ఇజ్రాయిల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులు ప్రయోగించగా పలు నగరాల్లో సైరన్ల మోత వినిపించింది. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో సుమారు 1700 మంది మృతి చెందినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని ఇరాన్ ప్రకటించగా ఇజ్రాయిల్ కూడా దాడులు కొనసాగుతాయని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఇరాన్ రాజధాని టెహరాన్‌లో పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు చోటుచేసుకోవడంతో భయాందోళనలకు గురైన ప్రజల్లో లక్ష మందికి పైగా నగరాన్ని వీడినట్లు సమాచారం. మరోవైపు దుబాయిలోని పలు భవనాలపై దూసుకొచ్చిన డ్రోన్‌లు, క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. అమెరికా తౌత్యా మద్దతు కేంద్రంపై కూడా డ్రోన్ దాడులు జరిగాయని సమాచారం. చమురు కేంద్రాలపై అమెరికా–ఇజ్రాయిల్ దాడుల కారణంగా నల్లటి ఆమ్ల వర్షం కురుస్తోందని, దీనివల్ల ఇరాన్ ప్రజలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని నివేదికలు చెబుతున్నాయి. హార్మోజ్ జలసంధి సమీపంలో అమెరికా భీకర దాడులు జరిపి ఇరాన్ మైన్ లేయర్లను ధ్వంసం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇరాన్–ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధ పరిణామాలను చైనా అంతరిక్షం నుంచి నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం వెల్లడి కావడంతో పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రతరమయ్యాయి.




రాత్రి ఆకాశంలో పేలుళ్లు చోటుచేసుకోవడంతో పలు నగరాల్లో సైరన్లు మోగాయి



డ్రోన్‌లు, క్షిపణులను అడ్డుకుంటున్న రక్షణ వ్యవస్థలు: గల్ఫ్ ప్రాంతంలోని నగరాల వైపు దూసుకొచ్చిన డ్రోన్‌లు, క్షిపణులను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకుంటున్న దృశ్యాలు యుద్ధ భీకరతను ప్రతిబింబిస్తున్నాయి.



ఇరాన్ నగరాల్లో భయానక పేలుళ్లు: వైమానిక దాడుల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ అగ్ని గోళాలు ఆకాశంలోకి ఎగిసిపడుతూ భయంకర దృశ్యాలు కనిపిస్తున్నాయి.



భవనాలు దెబ్బతిని పొగ మేఘాలు కమ్ముకోవడంతో ప్రజల్లో తీవ్ర భయం నెలకొంది.

## హర్మూజ్ జలసంధిలో అమెరికా భారీ దాడులు ఇరాన్‌కు చెందిన 16 నౌకలు ధ్వంసం

### ఇరాన్ హెచ్చరికల వెంటనే అమెరికా ప్రతిదాడి... హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తీవ్రం






సందేశం టైమ్స్, అంతర్జాతీయ డెస్క్, మార్చి 12 : పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల మధ్య ప్రపంచానికి కీలకమైన చమురు రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా భారీ సైనిక దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఇరాన్ నౌకాదళానికి చెందిన మైన్‌లేయింగ్ నౌకలను లక్ష్యంగా చేసుకుని వైమానిక మరియు క్షిపణి దాడులు జరిపి మొత్తం 16 నౌకలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించిన వీడియోలను కూడా యుఎస్ సెంట్రల్ కమాండ్ విడుదల చేసింది. ముందుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదికలో పది మైన్‌లేయింగ్ నౌకలను ధ్వంసం చేశామని ప్రకటించగా, తరువాత అధికారికంగా ఆ సంఖ్య 16కి పెరిగినట్లు వెల్లడించారు.ఇరాన్ హర్మూజ్ జలసంధి ద్వారా తమ శత్రు దేశాలకు ఒక్క లీటరు చమురు కూడా వెళ్లనివ్వబోమని హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ దాడులు జరిగాయి. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుండటంతో ఈ ప్రాంతం అంతర్జాతీయంగా అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగి ఉంది. ఇరాన్ నౌకాదళం మైన్లు వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు అమెరికా గూఢచారి సంస్థలు గుర్తించడంతో ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా హర్మూజ్ జలసంధి పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో గల్ఫ్ దేశాలు అప్రమత్తమయ్యాయి. చమురు ట్యాంకర్ల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, కొన్ని దేశాలు తమ చమురు రవాణాను ఇతర మార్గాలకు మళ్లిస్తున్నాయని అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ చమురు మార్కెట్లలో తీవ్ర అనిశ్చితి నెలకొనగా, పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



## చంద్రబాబు పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గి అప్పులు పెరిగాయి : వైఎస్ జగన్

సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 12 : రాష్ట్రంలో ఆదాయం తగ్గి ఖర్చులు పెరగడంతో అప్పుల భారం అధికమైందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. తాను గతంలో చెప్పిన విషయాలనే భారత నియంత్రణ మరియు లెక్కల పరిశీలన సంస్థ నివేదిక కూడా వెల్లడించిందని తెలిపారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చు రూ.2,36,486 కోట్లు కాగా వచ్చిన ఆదాయం రూ.1,70,767 కోట్లు మాత్రమేనని చెప్పారు. అనంతరం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ఏడాదిలో ఖర్చు రూ.2,49,906 కోట్లకు పెరిగిందని, అదే సమయంలో వచ్చిన ఆదాయం రూ.1,68,024 కోట్లకు తగ్గిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు పాలనలో ఆదాయం–ఖర్చుల మధ్య లోటు రూ.60,285 కోట్లకు చేరి 56 శాతం పెరిగిందని, అలాగే మొత్తం ఆర్థిక లోటు కూడా 30 శాతం పెరిగిందని జగన్ విమర్శించారు. కోవిడ్ సమయంలో ఆదాయాలు తగ్గినా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు అందించామని, కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అప్పులు అమాంతం పెంచారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే అప్పులకు కేంద్ర ప్రభుత్వం విధించే పరిమితిని కూడా దాటే పరిస్థితి ఏర్పడిందని జగన్ పేర్కొన్నారు.




## మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత: అనంతగిరి ఎస్సై నవీన్

సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 12: పోలీసు శాఖ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అనంతగిరి ఎస్సై నవీన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ ప్రజా భరోసా ఆధ్వర్యంలో బుధవారం అనంతగిరి మహిళా సమభావన సంఘం కార్యాలయంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ మాట్లాడుతూ మహిళలు, బాలల రక్షణ కోసం చట్టాలు బలోపేతం చేయబడినట్లు తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లయితే పోలీసులు బాధితుల ఇళ్లకే వచ్చి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేస్తారని వివరించారు. ప్రయాణ సమయంలో వాహనాలపై పరిమితికి మించి ఎక్కకూడదని, డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణించకూడదని మహిళలకు సూచించారు. సమాజాన్ని చక్కదిద్దే బాధ్యత మహిళలపై ఉందని, పిల్లలు చెడు దారిలో వెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయని, సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు లేదా బ్యాంకు వివరాలు పంచుకుంటే సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించి మహిళలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 12: 2027 జనాభా లెక్కలు ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. జిల్లాలో జనాభా గణన–2027 సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా) మరియు గృహాల గణన మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడుతుందని, రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహించబడుతుందని వివరించారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి జనాభా గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈసారి దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జనాభా గణన నిర్వహించనున్నట్లు, మొబైల్ యాప్‌లు మరియు వెబ్ పోర్టల్‌ల ద్వారా గణన ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. మొదటి దశలో ఇంటి నిర్మాణ పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీటి సౌకర్యం, మురుగు నీటి పారుదల, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి అంశాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సేకరిస్తారని వివరించారు. అనంతరం శిక్షణ నిర్వాహకులు సీపీఓ కిషన్ నాయక్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు. జనాభా గణాంక అధికారులు యువేందర్ బాబు, రవీంద్ర నాయక్ మండలాల్లోని రెవెన్యూ గ్రామాలు, పట్టణ వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసు, మాస్టర్ ట్రైనర్ రమేష్, ఎంపిడిఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కొండ ప్రవీణ్ కుమార్ నియామకం




సందేశం టైమ్స్, మంచిర్యాల, మార్చి 12: ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కొండ ప్రవీణ్ కుమార్‌ను నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాల అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన హ్యూమన్ రైట్స్ సమావేశంలో ఈ నియామకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చా వేదిక నిర్వహించగా అనంతరం కొంతమందికి పదోన్నతులు ప్రకటించారు. అందులో భాగంగా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కొండ ప్రవీణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్, కోఆర్డినేటర్‌గా శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, మంచిర్యాల జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా మమతను నియమించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ సోలమన్ రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంస్థ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన పని చేస్తామని వారు తెలిపారు

## లక్ష్యం ఉంటేనే విజయం – విద్యార్థులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రేరణ





సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 12: లక్ష్యం ఉంటేనే విజయం సాధ్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన విధానాన్ని గమనించి అభిరామ్, నాగశ్రీ, లాస్య, శివకుమార్, శృతి వంటి విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ప్రతిభపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకంగా బోధించాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీరు, పరిశుభ్రత వంటి సదుపాయాలను పరిశీలించి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారుల హాజరు, పౌష్టికాహార పంపిణీ, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వంటగదిని పరిశీలించి పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించడంతో పాటు కేంద్రంలో శుభ్రతను కాపాడాలని, భోజనం సరిగ్గా ఉడికించి అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలను పరిశీలించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వీధులు, కాలువలు, చెత్త నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి చెత్త పేరుకుపోకుండా సమయానికి తొలగించాలని, ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీపీఓ యాదగిరి, తహసిల్దార్ కృష్ణయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు



## సీఎంఆర్ డెలివరీలను సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 12: 2025–26 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ (సివిల్ రైస్ మిల్లింగ్) డెలివరీలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైస్ మిల్లర్లను సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల సమావేశంలో జిల్లాలోని బాయిల్డ్ మరియు రా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సుమారు 4,10,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అందుకు అనుగుణంగా మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో లేదా అవసరమైతే ఇతర ప్రదేశాల్లో కూడా వరి ధాన్యం నిల్వ చేయడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ సీజన్‌కు అవసరమైన ప్యాడి బస్తాలను (గన్నీలు) మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. రబీ 2024–25 మరియు ఖరీఫ్ 2025–26 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరీలను సకాలంలో పూర్తి చేసి సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని మిల్లర్లను కోరారు. జిల్లాలోని అన్ని బాయిల్డ్ మరియు రా రైస్ మిల్లర్లు సీఎంఆర్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. జిల్లాలో సుమారు 335 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొని, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే దించుకొని సంబంధిత ట్రక్ షీట్లు తక్షణమే సమర్పించాలని మిల్లర్లకు సూచించారు. గత సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీలు కొంతమేర పెండింగ్‌లో ఉన్నందున వాటిని వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. రాబోయే సీజన్‌కు ముందు బ్యాంక్ గ్యారంటీ, ఒప్పందం మరియు అవసరమైన ధాన్యం పరిమాణాన్ని లేఖ రూపంలో సమర్పించిన మిల్లర్లకే ధాన్యం కేటాయించబడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామరావు, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ రాము, సివిల్ సప్లై శాఖ సిబ్బంది మరియు జిల్లాలోని సుమారు 40 మంది రైస్ మిల్లర్లు పాల్గొన్నారు

## తెలంగాణలో డిజిటల్ విద్యకు ఊతం: ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే దిశగా విద్యాశాఖ కీలక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా అత్యాధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ పథకం కింద మొదటి విడతలో ఎంపిక చేసిన ఐదు వేల పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ట్యాబ్లెట్ పీసీలను పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయని విద్యాశాఖ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. భౌతిక వనరులతో పాటు ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనపై ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంతో అభ్యసన ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారడమే కాకుండా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

## తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన గవర్నర్ ప్రజలకు సందేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సందేశం ఇచ్చారు. తెలంగాణ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు వినమ్రతతో స్వీకరించడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కీలక బాధ్యతలను అప్పగించిన భారత రాష్ట్రపతి, భారత ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలకు సేవ చేయడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాంస్కృతిక సంపద, గొప్ప సంప్రదాయాలు, అసాధారణ పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పని చేసిన అనుభవం తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆవిష్కరణలు, సహనశక్తి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల అకుంఠిత దీక్ష, రాష్ట్రంలోని వనరులు, వ్యూహాత్మక దృష్టి సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వానికి, కేబినెట్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ లక్ష్యాలను గౌరవిస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌గా తన విధులను న్యాయబద్ధంగా, నిజాయితీగా, భారత రాజ్యాంగానికి అనుగుణంగా అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. సమగ్రత, సమైక్యత, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో సుసంపన్నమైన తెలంగాణ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఎల్‌బీ స్టేడియంలో దావత్-ఎ-ఇఫ్తార్ ఏర్పాట్లు ఘనంగా చేయాలి: మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12: రంజాన్ పండుగ సందర్భంగా మార్చి 15న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్‌బీ స్టేడియంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది తన మొదటి రంజాన్ దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమమని, దీన్ని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమానికి సుమారు పదివేల మంది హాజరవుతారని భావించి తగిన భద్రతా ఏర్పాట్లు, సరిపడా ఆహార సరఫరా, త్రాగునీరు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఆర్ అండ్ బి శాఖ స్టేజీ, గ్యాలరీలు, బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా ముందుగానే ఆహార భద్రత పరీక్షలు నిర్వహించాలని, వంట ప్రదేశాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఉద్యాన శాఖ డయాస్‌ను పూల అలంకరణతో అందంగా తీర్చిదిద్దాలని, వైద్య శాఖ వైద్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలని, అగ్నిమాపక శాఖ ఫైర్ టెండర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమాచార శాఖ ద్వారా ఎల్ఈడి స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ శిల్పావల్లి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జి.వి. నారాయణరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్లు, భవనాల శాఖ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12: రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి ప్రణాళికలు, ప్రస్తుత పనుల పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారి నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు వివరాలు వెల్లడించగా, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి రూ.374 కోట్ల ఉపకారవేతన నిధులు జమ


సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు మరియు మెయింటెనెన్స్ చార్జీల కోసం రాష్ట్రంలో రూ.374 కోట్ల నిధులను విడుదల చేసి 83,239 మంది విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ వెల్లడించింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.173 కోట్లు విడుదల చేయగా, కేంద్ర ప్రభుత్వం రూ.201 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులు తమకు అందిన మెయింటెనెన్స్ మొత్తాన్ని మినహాయించి ట్యూషన్ ఫీజు మరియు ఇతర రుసుములను సంబంధిత కళాశాలలకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఉపకారవేతన నిధులు జమ అయిన విద్యార్థుల వివరాలను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఈ-పాస్ లాగిన్లలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నిధుల విడుదలకు కృషి చేసిన ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కూడా విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 12 (టీ సంగమేశ్వర్): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఒక రోజు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరాలు వెల్లడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈ ఒరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 12న ఉదయం 10 గంటలకు సంగారెడ్డి జిల్లా కంది ప్రాంతంలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, గ్రామ పంచాయతీల సర్పంచులు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# వడదెబ్బతో మరణిస్తే రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12 (టీ సంగమేశ్వర్): వడదెబ్బతో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. హీట్‌వేవ్, సన్‌స్ట్రోక్ వంటి వడదెబ్బ ఘటనలను రాష్ట్రానికి ప్రత్యేక విపత్తుగా గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా వ్యక్తి వడదెబ్బ కారణంగా మరణించినట్లు అనుమానం ఉన్నట్లయితే తప్పనిసరిగా పోస్ట్‌మార్టం నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. మరణ ధృవీకరణ పత్రం, పోస్ట్‌మార్టం నివేదికను సంబంధిత అధికారులకు సమర్పిస్తే పరిశీలన అనంతరం నష్టపరిహారం అందజేయబడతుందని అధికారులు తెలిపారు.

# వేసవిలో ప్రజలకు ఉపశమనం... చలివేంద్రం ఏర్పాటు చేసిన బీజేపీ యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి




సందేశం టైమ్స్, పటాన్చెరు, మార్చి 12 (బి. డేవిడ్): పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు, 16వ వార్డులోని ఐనోలు గ్రామంలో బీజేపీ యువ నాయకుడు మందుమూల హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు ఉపశమనం కలిగించే ఈ చలివేంద్రాన్ని ప్రతి వేసవిలో ఏర్పాటు చేస్తూ వస్తున్నామని హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మందుమూల శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కిరీటాల జంగయ్య, సతీష్, శ్రీశైలం, సుధీర్, శ్రావణ్, సతీష్ రెడ్డి, శశి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.






# రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు అస్మా



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 12 : ఇటీవల రాజ్యసభ సభ్యునిగా నియమితులైన వేం నరేందర్ రెడ్డిని జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అస్మా శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ఆకాంక్షలు, అభివృద్ధి మరియు ప్రజా సమస్యలను పార్లమెంట్ వేదికగా బలంగా వినిపిస్తూ ప్రజలకు న్యాయం చేసే విధంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు ప్రియాంక, షబానా పాల్గొన్నారు.




# జన గణన విధులను పక్కాగా నిర్వహించాలి: అడిషనల్ కలెక్టర్ పాండు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 12 (టీ సంగమేశ్వర్): జన గణన విధులను పక్కాగా నిర్వహించినప్పుడే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించగలదని అడిషనల్ కలెక్టర్ పాండు పేర్కొన్నారు. సెన్సస్–2027 నేపథ్యంలో జనాభా లెక్కల సేకరణలో పాల్గొననున్న తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత శాఖల అధికారులకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 13 వరకు మూడు రోజుల పాటు శిక్షణ కొనసాగనుండగా హైదరాబాద్ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 2011లో చివరిసారి జనాభా గణన నిర్వహించగా ఈసారి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ చేపట్టేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తొలి దశలో నివాస గృహాలు, వివిధ రకాల కట్టడాలు, కుటుంబ వివరాలు సేకరించనుండగా రెండో దశలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయనున్నట్లు చెప్పారు. దేశంలో తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో జన గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. సి ఎం ఎం ఎస్ పోర్టల్ ద్వారా వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. జన గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై నిజమైన వివరాలను అందించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం ఎక్కడా బయటకు వెల్లడి కాకుండా నేరుగా సర్వర్‌లో భద్రపరిచే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. ఈసారి సెల్ఫ్ డిక్లరేషన్ కీలకమని అధికారులు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చార్జ్ లెవెల్ అధికారులు ప్రతిరోజూ జన గణన ప్రక్రియను సమీక్షించాలని, అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువులోపు జనాభా లెక్కల సేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జన గణన ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, సిపిఓ బాలశౌరి, డిప్యూటీ సీఈవో స్వప్న, ఆర్డీఓలు రాజేందర్, దేవుజ, డీఈఓ వెంకటేశ్వర్లు, డీసీఓ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఒకరోజు అధికారులు గా మారిన విద్యార్థులు... బోరంచ పాఠశాలలో వినూత్న కార్యక్రమం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మార్చి 12 (టీ సంగమేశ్వర్): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు మరియు జిల్లా స్థాయి అధికారుల పాత్రలను స్వీకరించి ఒక రోజు పాటు ఆ బాధ్యతలను నిర్వహించారు. విద్యార్థులు నిజమైన అధికారుల్లా వ్యవహరిస్తూ పాఠశాల నిర్వహణలో పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో స్వాతిక్ రెడ్డి ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించగా, డిప్యూటీ డీఈఓగా బి. శ్రావణి, డీఈఓగా ఉమా మహేశ్వరి బాధ్యతలు చేపట్టారు. జిల్లా విద్యాధికారిగా సి.ఎస్. స్వాతి, మండల విద్యాధికారిగా మరో విద్యార్థి బాధ్యతలు నిర్వహించారు. ఎం. ప్రవళిక జిల్లా కలెక్టర్ పాత్రను పోషించగా, సంధ్యారాణి సబ్ కలెక్టర్‌గా వ్యవహరించారు. పలు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తరగతుల్లో పాఠాలు బోధించి తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించి బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాజశేఖర్ షేట్కార్, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, విజయ్ కుమార్, సాయిబాబా, రవి కుమార్, నర్సింలు, వై నర్సింహులు, జగదీష్ కుమార్, ఉపాధ్యాయురాలు అనుష తదితరులు పాల్గొన్నారు. స్వయంపాలన దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎదగడానికి అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# మార్చి 13న జాబ్ మేళా – 800కు పైగా ఉద్యోగ అవకాశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 12 (టీ సంగమేశ్వర్): డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ తయారీ యూనిట్, జహీరాబాద్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 13న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడిస్తూ మార్చి 13, 2026 శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్ ఖాన్‌పేట్ హనుమాన్ నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా ట్రెయినీ మరియు అప్రెంటిస్ పోస్టుల కింద 800కు పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అర్హత కలిగిన యువత తమ విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా మరియు ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాన్ని పొందాలని ఆయన కోరారు.

# ఇఫ్తార్ విందుతో సోదరభావానికి నిదర్శనం



సందేశం టైమ్స్, జోగిపేట్ (అందోల్), మార్చి 12 (టీ సంగమేశ్వర్): రంజాన్ మాసం సందర్భంగా అందోల్ మండల పరిధిలోని అక్సన్‌పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన శ్రావణ్ కుమార్ ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందును ఘనంగా ఏర్పాటు చేశారు. ఉపవాసం ముగిసిన అనంతరం ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసి విందులో పాల్గొని పరస్పర సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు నరసింహ రెడ్డి మాట్లాడుతూ మతాలు వేరు అయినా మనసులు ఒక్కటేనని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ జితేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భూమా గౌడ్, జకీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేష్, కృష్ణ, చరణ్, గణేష్ బీరు తదితరులు మరియు గ్రామ ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా గ్రామంలో సోదరభావం, సామరస్య వాతావరణం నెలకొంది.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరాల నివారణపై అవగాహన సదస్సు

**జీవితం ఒక్కటే... సైబర్ మోసాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాల నుంచి జాగ్రత్తలు పాటించాలి – నడిగూడెం ఎస్పీ సూచనలు**







నడిగూడెం, సూర్యాపేట, మార్చి 12 (సందేశం టైమ్స్ నడిగూడెం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరరహిత సమాజ నిర్మాణం, పౌరుల బాధ్యత, మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణపై నడిగూడెం మండల పరిధి ఆకుపాముల గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ గారు పాల్గొని గ్రామస్తులకు నేరరహిత సమాజ నిర్మాణం, పౌరుల బాధ్యతకు సంబంధించిన అవగాహన కల్పించారు. బినాన్స్, క్రిప్టో కరెన్సీ లాంటి డిజిటల్ మనీ మార్పిడిలో జాగ్రత్తలు పాటించాలని, అత్యాశకు వెళ్లి సైబర్ మోసగాళ్లలో చిక్కుకొని ఆర్థిక నష్టం కలగరాదు అని హెచ్చరించారు.అలాగే, డ్రగ్స్ మత్తుతో జీవితం నాశనం అవుతుంది, పిల్లల చెడు అలవాట్లను తల్లిదండ్రులు గమనించి సరిదిద్దాలి, రోడ్డు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి, మహిళలను గౌరించాలి, సురక్షిత సమాజం కోసం పోలీసుల సహకారం పొందాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ, నడిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, కోదాడ టౌన్ ఇన్స్పెక్టర్ శివ శంకర్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఇతర ఎస్సైలు రవీందర్, ఏడకొండలు, కోదాడ ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ రామాచారి, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, గ్రామ పౌరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ మోసాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




హైదరాబాద్: వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై ఉన్న ఆందోళనను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ప్రకటనలు ఇస్తూ మోసాలకు తెరతీస్తున్నారని తెలిపారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామని, అదనపు సిలిండర్లు అందిస్తామని సోషల్ మీడియా వేదికల ద్వారా మోసపూరిత ప్రకటనలు చేస్తూ, వాట్సాప్ మరియు ఎస్ఎంఎస్‌ల ద్వారా నకిలీ వెబ్‌సైట్ లింకులను పంపించి ప్రజలను మభ్యపెడుతున్నారని హెచ్చరించారు. ముందుగా డబ్బులు చెల్లిస్తే అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని వచ్చే సందేశాలు కచ్చితంగా సైబర్ మోసాలేనని ప్రజలు గుర్తించాలని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని తెలిపారు. గ్యాస్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లు లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. అలాగే ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# పెద్దారెడ్డిపేట్ గ్రామం లో విషాదం చెట్టును ఢీ కొట్టి ఒక వ్యక్తి మృతి



సందేశం టైమ్స్, మార్చి 12, సంగారెడ్డి, పుల్కల్ ప్రతినిధి మహేష్ బాబు: పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పెద్దారెడ్డిపేట్ స్థానికుడు గాజుల యదుల్ (38) బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన సింగూర్ ప్రాజెక్ట్ సమీపంలో జరిగింది. యదుల్ మాలపాడు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ అతివేగంగా బైక్ నడిపిన సమయంలో అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడం వలన ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు






సందేశం టైమ్స్, మార్చి 12, సంగారెడ్డి, ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు ఇచ్చిన ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవాని చంద్ర ప్రధాన అతిథిగా హాజరయ్యారు. "Give to Gain" ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, మహిళా సాధికారత కోసం సమాజం పునరంకితం కావాలని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి కె. జయంతి, జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి శ్రీ కృష్ణార్జున, ఫోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి శ్రీలేఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి బి. సౌజన్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఆర్. అనిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. ధనలక్ష్మి, కోర్టు మహిళా సిబ్బంది, కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం



సందేశం టైమ్స్, మార్చి 12, సంగారెడ్డి, ప్రతినిధి టి సంగమేశ్వర్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లు విడుదల కాగా, మీ సేవ కేంద్రాల ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించబడింది. అలాగే 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా హాల్ టికెట్లు పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 5,17,727 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,07,573 మంది 5,329 ప్రభుత్వ పాఠశాలల నుంచి, 60,139 మంది 1,057 గురుకుల పాఠశాలల నుంచి, 2,50,015 మంది 5,288 ప్రైవేట్ మరియు ఎయిడెడ్ పాఠశాలల నుంచి పరీక్షలు రాయనున్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సులభంగా చేరుకునేందుకు హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ కూడా ముద్రించబడినట్లు వెల్లడించారు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మన్నే శ్రీనివాస్-స్రవంతి దంపతులకు 20వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, మార్చి 12, సంగారెడ్డి, ప్రతినిధి టి సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మార్వెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మన్నే శ్రీనివాస్ మరియు స్రవంతి దంపతులకు వారి 20వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులు, స్నేహితులు, పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, "మన్నే శ్రీనివాస్–స్రవంతి దంపతులు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ఆనందంగా జీవించాలని కోరుకుంటూ, వారి దాంపత్య జీవితం ఇలాగే సంతోషంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాము" అని శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



సందేశం టైమ్స్, మార్చి 12, జోగిపేట, అందోల్, ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని పోసానిపేట గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. గోపాల్, ఉప సర్పంచ్ జి. రాములు, వార్డు సభ్యులు, విలేజ్ సెక్రటరీ, కాంట్రాక్టర్ హనీఫ్, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళా సంఘ కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని గ్రామ నాయకులు తెలిపారు.

# నారాయణఖేడ్ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోరిన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

సందేశం టైమ్స్, మార్చి 12, నారాయణఖేడ్, ప్రతినిధి టి. చంద్రశేఖర్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నారాయణఖేడ్ శాసనసభ్యుడు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి నారాయణఖేడ్ అభివృద్ధి కోసం అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# నల్లపోచమ్మ తల్లి దేవాలయానికి రేకుల షెడ్డు నిర్మాణం కోసం రూ.11,115 విరాళం



సందేశం టైమ్స్, మార్చి 12, మనూర్, ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలో మంజీర నది ఒడ్డున స్వయంభువుగా కొలువుదీరిన శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి హైదరాబాద్ బోరబండకు చెందిన దాత ఎం. రాజు రూ.11,115 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు అమ్మవారి ఆశీర్వాదాలు ఉండాలని కోరారు. అనంతరం ఆలయ చైర్మన్ మల్లయ్య దాత ఎం. రాజును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగయ్య స్వామి, ఆలయ సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థాన నిర్వాహకులు భక్తులు, దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం – మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి



సందేశం టైమ్స్, మార్చి 12, పటాన్చెరువు, రిపోర్టర్ బి. డేవిడ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంద్రేశం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి 12వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో మొదటి ప్రాధాన్యతను పరిసరాల పరిశుభ్రతకు ఇచ్చామని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, శానిటైజేషన్ వంటి కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

# గాయపడిన అంజయ్యకు అండగా గరుడసేన యూత్ సభ్యులు



సందేశం టైమ్స్, మార్చి 12, ఆందోల్–జోగిపేట్, ప్రతినిధి టి సంగమేష్: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం జోగిపేట్ పట్టణానికి చెందిన ఆకాష్ తండ్రి అంజయ్య రాత్రి స్కూటీపై వెళ్తుండగా బండి టైరు జారి కిందపడటంతో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న గరుడసేన యూత్ సభ్యులు వెంటనే స్పందించి జోగిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అంజయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తమ వంతు సహాయాన్ని అందించారు. అంజయ్య త్వరగా కోలుకోవాలని గరుడసేన యూత్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గరుడసేన యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎక్లాస్‌పూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ




సందేశం టైమ్స్, మార్చి 12, టేక్మల్, రిపోర్టర్ బి. రమేష్ బాబు: సంగారెడ్డి జిల్లా టేక్మల్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చింతకుంట యశోద అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన పెద్దలు, నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య బృందం రోగులను పరీక్షించి అవసరమైన సూచనలు అందించింది. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ చింతకుంట యశోద అంజయ్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.